సాక్షి రంగారెడ్డి

సోమవారం । 25 । మార్చి । 2024



మండే ఎండలు

వేసవికాలం ప్రారంభంలోనే అనూహ్యంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఎండలు మండిపోతున్నాయి.


8లో ▸



'సెంట్రింగ్' దొంగల అరెస్టు

కొత్త ఇళ్ల నిర్మాణం కోసం డంప్ చేసిన సెంట్రింగ్ డబ్బాలను దొంగిలిస్తున్న ముఠాను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు.

8లో ▸



న్యూస్‌రీల్

నేడు చంద్రగ్రహణం లేదు

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



మాట్లాడుతున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: భారతదేశంలో సోమవారం హోలీ పండుగ రోజు చంద్రగ్రహణం కనిపించదని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ స్పష్టం చేశారు. బాలాజీ దేవాలయం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా, ఆఫ్రికా దేశాల్లో చంద్రగ్రహణం కనిపిస్తుందని.. ఆ సమయం ప్రకారం చూస్తే ఉదయం 9 గంటల సమయంలో గ్రహణం పడుతుందన్నారు. మనకు ఉదయం చంద్రుడు కనిపించడు కాబట్టి మన దగ్గర చంద్రగ్రహణం ఉండదని చెప్పారు. చాలామంది భక్తులు హోలీ రోజు గ్రహణం ఉంటుందా.. ఆలయం మూసివేస్తారా అనే ప్రశ్నలు అడుగుతున్నారని.. భక్తులకు ఇలాంటి సందేహాలు అవసరం లేదని.. చంద్రగ్రహణం మన దేశంలో ఉండదని స్పష్టం చేశారు. ప్రజలంతా ఆనందంగా హోలీ పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు.

చేవెళ్ల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తా

సివిల్ ఇంజనీర్ సూర్యప్రకాశ్ రెడ్డి



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: ప్రజలకు సత్వర న్యాయం, అవినీతి రహిత పాలన అందించాలనే ఆలోచనతో ఎంపీ ఎన్నికల్లో పోటీచేసేందుకు నిర్ణయించుకున్నట్లు సివిల్ ఇంజనీర్ సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు చేవెళ్లలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్ల లోక్‌సభ బరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్లు తెలిపారు. సరూర్‌నగర్‌కు చెందిన తాను ఇంజనీరింగ్ చదివి దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టుల్లో పనిచేసినట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో తిరిగిన సమయంలో ప్రజలకు సేవచేయాలనే ఆలోచన కలిగి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రైతు బిడ్డగా రైతులతోపాటు సామాన్య ప్రజల సమస్యలు తెలుసన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించాలనే ఆలోచనతో 14 అంశాలతో కూడిన మేనిఫెస్టోను రూపొందించినట్టు పేర్కొన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతి రహిత పాలనతోపాటు రాజకీయ, సామాజిక, విద్య, వ్యవసాయ ఆరోగ్య సంస్కరణలు అవసరమన్నారు. ప్రజలు ఎన్నికల్లో తనను ఆదరిస్తే వారికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆయన వెంట ప్రొఫెసర్ సురేశ్, శ్రీనివాస ఆదిత్యరాజ్, తదితరులు ఉన్నారు.

బీజేపీకి గూటికి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని జరిగిన ఓ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డికి కిషన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విష్ణువర్ధన్‌రెడ్డి బీజేపీ నుంచి షాద్‌నగర్ టికెట్ ఆశించారు. నియోజకవర్గంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టి అనతి కాలంలో అందరి దృష్టిని ఆకర్షించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించగా అధిష్టానం మొండి చెయ్యి చూపింది. దీంతో ఆ పార్టీకి రాజీనామా చేసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బరిలోకి దిగారు. ఎన్నికల్లో 30 వేలకు పైగా ఓట్లు సాధించి ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా నిలిచారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిని సంప్రదించడంతో ఆయన సుముఖం వ్యక్తం చేశారు. తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో జాలీగా..



రసాయన రంగులతో ముప్పు

- ఆరోగ్యానికి హానికరం
- పర్యావరణానికి దెబ్బ
- సహజ రంగులే శ్రేయస్కరం
- సూచిస్తున్న వైద్యులు

షాద్‌నగర్/షాబాద్: హోలీ అంటేనే రంగుల కేళి.. చిన్న పెద్దా తేడా లేకుండా అందరు ఎంతో ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని వేడుకను చేసుకుంటారు.. సోమవారం సంబరాలకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. వేడుకల కోసం ఆరోగ్యానికి హాని కలిగించే రసాయన పూరిత రంగులు కాకుండా సహజ సిద్ధమైన రంగులు శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కృత్రిమ రంగుల వినియోగం మితిమీరితే పర్యావరణం దెబ్బతింటుదని పర్యావరణ ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో దొరికే రసాయన రంగులతో ఆరోగ్యానికి హానికరమని, సహజసిద్ధ రంగులతో ఎలాంటి సమస్యలు రావని పేర్కొంటున్నారు.

సహజ రంగులైతే మేలు

సహజ సిద్ధమైన రంగులు వాడితే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో వివిధ రకాలైన రంగులను తయారు చేసుకోవచ్చు. వీటితో ఎలాంటి హాని జరగదు. దానిమ్మ, టమాటతో ఎరుపు రంగు, మోదుగుపూలు, క్యారెట్‌తో ఆరెంజ్ రంగు, బీట్‌రూట్‌తో ఊదారంగు, ఆకు కూరలతో ఆకుపచ్చ రంగు, పసుపు కొమ్ములతో పసుపు రంగు ఇలా సహజ సిద్ధమైన రంగులను తయారు చేసి వేడుకలను ఆనందంగా జరుపుకోవచ్చు.

ఆ రంగులతో ప్రమాదం

రంగుల్లో పాదరసం. సిలికా, మైకా, సీసం, వంటి వివిధ రకాల రసాయనాలు కలుపుతారు. ఇవి చర్మానికి, కళ్లకు, శ్వాస సంబంధిత సమస్యలకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు.

- రంగుల పొడి చల్లినప్పుడు అవి గాలిలో కలిసిపోయి నోటిలోకి, శ్వాసనాళాల్లోకి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. గాలిపీల్చినప్పుడు ఈ రంగులు ఊపిరితిత్తుల్లోకి ప్రవేశిస్తాయి. దీంతో అస్తమా, ఎలర్జీ ఏర్పడే అవకాశం ఉంటుంది.
- రసాయన రంగులతో శరీరం దురద, మంట, నొప్పి కలుగుతుంది. కళ్లలో రంగులు పడితే కంటి సమస్యలు ఏర్పడతాయి. కంటి పొరలు దెబ్బతినే అవకాశం ఉంటుంది.
- రంగులు నోట్లోకి వెళ్తే వాంతులు, విరోచనాలు అవుతాయి. కడుపునొప్పి వస్తుంది.
- నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.
- నీలి రంగు చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) క్యాన్సర్‌కు కారణమవుతాయి.
- పొడర్లు, గులాల్, లెడ్, క్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్, వినిడికి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్ఫలితాలకు దారితీస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి

- హోలీ ఆడే ముందు చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చర్మానికి రంగులు పట్టుకోకుండా ఆవాల నూనె, జెల్లీని రాసుకోవాలి.
- కళ్లకు అద్దాలు పెట్టుకుంటే రంగునీళ్లు కళ్లలో పడకుండా ఉంటాయి.
- హోలీ ఆడిన వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే చేతి వేళ్ల గోర్ల నుంచి రంగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది.

మార్పు కోసం కృషి



రసాయన రంగులు మానుకోవాలి. ప్రకృతిలో దొరికే పూలు, ఆకులతో తయారయ్యే రంగులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కాపాడినట్టే. యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా ప్రజల్లో మార్పు కోసం కృషి చేస్తున్నాం.

– జాకీర్‌షరీఫ్, యాంటీ కరప్షన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

రసాయన రంగులతో ప్రమాదం



రసాయన రంగులతో ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరం మంట, దురద వస్తాయి. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలతోపాటు శ్వాస సంబంధిత వ్యాధుల ముప్పు ఉంటుంది. సహజ సిద్ధమైన రంగులు మేలు.

– డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, షాద్‌నగర్

ప్రాణాలతో చెలగాటం వద్దు



రంగుల పండగ పూర్తయిన తర్వాత చాలామంది రంగులు కడుక్కునేందుకు, స్నానం చేసేందుకు చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. అలాకాకుండా ఇంటివద్దనే రంగులను కడుక్కోవడం ఉత్తమం. చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– కాంతారెడ్డి, సీఐ షాబాద్

అంతా.. ఆ తాను ముక్కలే!

- మూడు లోక్‌సభ స్థానాలపై ప్రధాన పార్టీల గురి
- ఒకరు మినహా మిగిలిన వారంతా గతంలో గులాబీ నేతలే
- నాడు బీఆర్‌ఎస్‌లో సహచరులు.. నేడు ప్రత్యర్థులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా:

బీఆర్‌ఎస్ అభ్యర్థి: గతంలో కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల కాలం పని చేసిన నేత.

బీజేపీ అభ్యర్థి: బీఆర్‌ఎస్ పార్టీలో రాష్ట్ర మంత్రిగా, కీలక నేతగా గుర్తింపు పొందిన నాయకుడు.

కాంగ్రెస్ అభ్యర్థి: బీఆర్‌ఎస్‌లో మంత్రిగా పనిచేసిన నాయకుడి సతీమణి, ప్రస్తుతం అదే పార్టీలో జెడ్పీ చైర్‌పర్సన్ కూడా...

.. ఇలా ప్రధాన పార్టీల నుంచి మల్కాజ్‌గిరి అభ్యర్థులుగా బరిలో ఉన్న నాయకులంతా ఏదో రకంగా బీఆర్‌ఎస్‌తో సంబంధం కలిగిన వారు కావడం విశేషం. ఈ ఒక్క లోక్‌సభ పరిధిలోనే కాకుండా చేవెళ్ల, సికింద్రాబాద్ స్థానాల్లో కూడా ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న వారిలో ఒక్కరు మినహా మిగిలిన వారంతా బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసిన వారే. వీరిలో ఒక్క బీజేపీ సిట్టింగ్ ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మినహా మిగిలిన ఎనిమిది మందీ గులాబీ మొక్కలే. ఆ తోటలో వికసించిన పుష్పాలు కావడం విశేషం. కొసమెరుపేమిటంటే.. ప్రస్తుతం ప్రధాన పార్టీల నుంచి ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న వారిలో మెజార్టీ అభ్యర్థులు స్థానికేతరులు. దీంతో వారంతా తమ ఓటును తాము వేసుకోలేని పరిస్థితి. కిషన్‌రెడ్డి, రాగిడి, పద్మారావు, దానం మినహా మిగిలిన అభ్యర్థులంతా తమ ఓటు ఇతరులకు వేయాల్సిందే.

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో..

2014 నుంచి 2018 వరకు చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కొనసాగారు. అప్పట్లో ఆయన బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత ఆ పార్టీని వీడారు. 2019 ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి.. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. గతంలో వీరిద్దరూ బీఆర్‌ఎస్ నుంచి ఎంపీలుగా గెలుపొందిన వారే. ప్రస్తుతం ఈ ఇద్దరు నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడారు. వీరిలో ఒకరు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండగా.. మరొకరు బీజేపీ అభ్యర్థి. అభ్యర్థులు పాతవారే.. కానీ, ఇద్దరూ వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగుతున్నారు. అంతేకాదు వీరిద్దరి నివాసాలు సైతం జూబ్లీహిల్స్‌లో ఉన్నాయి. గతంలో వీరిద్దరూ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన గెలుపొందగా.. ప్రస్తుతం ఆ పార్టీ నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీ చేస్తున్నారు. ఈయన నివాసం కుత్బుల్లాపూర్‌లో ఉంది.

మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో..

ప్రస్తుతం బీజేపీ నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ సైతం గతంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగిన నాయకుడే. అదే పార్టీ నుంచి హుజురాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పని చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో తలెత్తిన విభేదాలతో ఆయన బీఆర్‌ఎస్‌ని వీడి.. బీజేపీలో చేరారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వికారాబాద్ సిట్టింగ్ జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి కూడా గతంలో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన వారే. ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి మాత్రం గతంలో కాంగ్రెస్‌లో పని చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరపున గెలుపొందారు. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలబడ్డారు. అదే స్థానం కోసం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి పద్మారావు బరిలోకి దిగుతున్నారు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటి వరకు పార్టీ మారని ఏకైక నాయకుడు కూడా ఈయనే.

'పట్నం' బాటపట్టిన కేడర్!

తాండూరు: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థులు తమ అనుచర గణంతో నియోజకవర్గాన్ని చుట్టుముట్టేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తారనుకున్న సునీతారెడ్డికి అధిష్టానం మల్కాజ్‌గిరి నుంచి అవకాశం ఇవ్వడంతో పట్నం వర్గీయులు ప్రచారానికి సన్నద్ధమవుతున్నారన్నారు. రెండు నెలల పాటు పార్లమెంట్ సెగ్మెంట్‌లో ప్రచారానికి వ్యూహ రచన చేస్తున్నారు. ఇందుకు జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మాజీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకుల మద్దతు కూడగట్టుకొనేందుకు పట్నం వర్గీయులంతా ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో విస్తృతంగా పర్యటిస్తున్నారు.



పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ నగదు, వెండి

పోలీసుల ముమ్మర తనిఖీలు

రాయికల్‌వద్ద రూ.16.50 లక్షలు, 5.5 కిలోల వెండి స్వాధీనం

షాద్‌నగర్‌రూరల్: లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ టోల్‌ప్లాజా చెక్ పోస్ట్‌వద్ద నిత్యం వాహన తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. మహారాష్ట్ర, షోలాపూర్ జిల్లా సంగోల గ్రామానికి చెందిన జయదేవ్ ఆర్టీసీ బస్సులో వనపర్తి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు ఆర్టీసీ బస్సులను తనిఖీ చేశారు. జయదేవ్ వద్ద రూ.16.50 లక్షల నగదు, 5.5 కిలోల వెండి ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ ప్రతాప్‌లింగం మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతులు లేకుండా నగదు, బంగారం, వెండి, మద్యం తరలించడం నేరమని అన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల్లో తరలించే నగదు, బంగారం, వెండి వస్తువులకు తప్పనిసరి ఆధారాలను చూపించాలని అన్నారు. లేదంటే స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి



మాట్లాడుతున్న సబితారెడ్డి, చిత్రంలో కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మీర్‌పేట: బడుగు, బలహీన వర్గాల గొంతుక అయిన ఈ ప్రాంతానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ వాణి, బాణి లోక్‌సభలో వినిపించాలంటే ప్రజలంతా ఓటు వేసి గెలిపించుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంటరీ సన్నాహాక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నిషానా లేకుండా చేస్తానని ముఖ్యమంత్రి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడిపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. వంద రోజుల్లో మార్పు తెస్తామన్నవారు రాష్ట్రంలో కరెంటు కోతల్లో మార్పు తెచ్చారని, పంటలను ఎండబెడుతున్నారని, రైతులకు ఇస్తానన్న రుణమాఫీ ఇవ్వలేదని, ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ముక్కుముఖం తెలియని రంజిత్‌రెడ్డిని గతంలో కేసీఆర్ ఆశీర్వదంతో గెలిపించుకుంటే నేడు మోసపూరితంగా పార్టీ మారారని విమర్శించారు. మన శక్తి సామర్థ్యాలు చూపించాల్సిన సమయం ఆసన్నమైందని, 96 కులాలను ఏకం చేసి వారికి గుర్తింపు తెచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌కు మహేశ్వరం నుంచి 60 వేల మెజారిటీ ఇచ్చి చేవెళ్లలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కార్యకర్తల శ్రమ లేకుండా ఏ నాయకుడూ ఎదగలేరని, అందరూ సమష్టిగా పనిచేసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని అన్నారు. ఈ ప్రాంతం నుంచి గతంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పనితనం ఏమిటో చూశారని, ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గె మల్లేశం, దయానంద్ గుప్తా, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భువనగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్



క్యామ మల్లేశ్‌కు అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

ఇబ్రహీంపట్నం: గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషిచేయాలని భువనగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ కోరారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థిగా మల్లేశ్‌ను ప్రకటించడంతో ఆదివారం పెద్దసంఖ్యలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. భువనగిరి ఖిల్లాపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసేందుకు బూత్ స్థాయి నుంచి బీఆర్‌ఎస్ విభాగానికి చెందిన విద్యార్థి, యువత, కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించి, అండగా ఉంటానన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మల్లేశ్‌ను కలిసి అభినందనలు తెలిపినవారిలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్, రైతు సమతి నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మొద్దు అంజిరెడ్డి, పార్టీ నాయకులు అల్వాల్ వెంకట్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, అచ్చన శ్రీకాంత్, కాలె రమేష్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల సమస్యలపై పోరాటం

తుర్కయంజాల్: తెలంగాణ ఉద్యమకారుల సమస్యల సాధనకు నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డా. సీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ కందాల బల్‌దేవ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్, మున్సిపాలిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు అశ్విని, మాజీ ఉపసర్పంచ్ తూర్పునూరి ప్రవీణ్ కుమార్ గౌడ్‌లకు సభ్యత్వం అందజేశారు.



సమావేశంలో పాల్గొన్న ఫోరం సభ్యులు

జ్ఞాన సభలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లపై మాట్లాడుతున్న నాయకులు

- ఆర్యవైశ్య మహాసభ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా

బడంగ్‌పేట: సనాతన వేదాంత జ్ఞాన సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆర్యవైశ్య మహాసభ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్ గుప్తా, కన్వీనర్ కాశెట్టి పాండు గుప్తా వెల్లడించారు. హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, సద్గురు మలయాళ స్వామి భక్త బృందం సంయుక్తంగా నిర్వహించే 98వ జ్ఞానసభలు బాలాపూర్ ఎస్వీఆర్ కన్వెన్షన్‌లో సోమవారం నుంచి మూడు రోజులు కొనసాగుతాయన్నారు. ఈ మేరకు ఆదివారం వారు యాగశాల, సభావేదిక తదితర ఏర్పాట్లను ఏర్పేడు ఆశ్రమ పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి స్వామి, అసంగానందగిరి స్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత మొదటిసారి వేదాంత జ్ఞాన సభలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే సభలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు పదివేల మంది భక్తులు హాజరవుతారన్నారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా భోజన, వసతి ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం ఉదయం గణపతి పూజ, ప్రణవ పతాకావిష్కరణ, కలశ స్థాపన, అఖండ జ్యోతి ప్రజ్వలనతో జ్ఞాన సభలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం అనంతరం పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు ప్రవచనాలు, సందేశాలుంటాయన్నారు.

మండే ఎండలు

మొదలైన సీజనల్ వ్యాపారాలు
- కొబ్బరిబోండాలు, పండ్లు, జ్యూస్‌లకు పెరిగిన డిమాండ్

ఆమనగల్లు: మండుతున్న ఎండలతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. వేసవికాలం ప్రారంభంలోనే అనూహ్యంగా ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు మండిపోతున్నాయి. దీంతో వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలను సేవిస్తున్నారు. ముఖ్యంగా ఎండలు ఎక్కువ కావడంతో సీజనల్ వ్యాపారాలు జోరందుకున్నాయి. పలు కూడళ్లలో, ప్రధాన రహదారుల పక్కన కొబ్బరిబోండాల విక్రయాలు, జ్యూస్‌ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. అలాగే పుచ్చకాయలు, ఇతర పండ్ల విక్రయాలు పెరిగాయి. వీటితో పాటు చల్లని పానీయాలకు డిమాండ్ పెరిగింది. కూల్‌డ్రింక్స్, లస్సీ, ఐస్‌క్రీమ్‌ల విక్రయాలు ఊపందుకున్నాయి. వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు స్విమ్మింగ్ పూల్‌ల్లో ఈత కొడుతున్నారు. అలాగే, మార్కెట్లో పేదోడి ఫ్రిడ్జ్‌గా భావించే కుండలు విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొత్తానికి ఎండల తీవ్రతతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


పండ్ల విక్రయం


స్విమ్మింగ్ పూల్‌లో సేదతీరుతున్న యువకులు


కొబ్బరిబోండాల విక్రయం

సీఎం రేవంత్‌ను కలిసిన శ్రీను



ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం ఆమనగల్లు పట్టణానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆమనగల్లులో జూనియర్ కళాశాల భవన నిర్మాణ సమస్యలను పరిష్కరించాలని సీఎంను అభ్యర్థించినట్లు అప్పం శ్రీను తెలిపారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన నాయకులు


రంజిత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం నేతలు

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని ఆ పార్టీ వికలాంగుల విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు మద్యపాగ సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాచారి, జ్ఞానేశ్వర్, పరమేశ్‌గౌడ్ తదితరులు ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

‘సెంట్రింగ్’ దొంగల అరెస్టు

రూ.1,85,000 నగదు స్వాధీనం
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కొత్త ఇళ్ల నిర్మాణం కోసం ఇళ్ల వద్ద డంప్ చేసిన సెంట్రింగ్ డబ్బాలను దొంగిలిస్తున్న ముఠాను ఆదివారం ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇండ్ల నిర్మాణం కోసం సెంట్రింగ్ డబ్బాలు తీసుకొచ్చి ఇండ్ల వద్ద డంప్ చేసి ఉంచిన డబ్బాలను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఆదిబట్ల పోలీసులు నిఘా పెట్టారు. హైదరాబాద్ కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ నసీర్ అలీ (40), బొలక్‌పూర్‌కు చెందిన మహమ్మద్ ఫయాజ్ (19), ముషీరాబాద్‌కు చెందిన పక్కరణి కుమార్(36) రెక్కి నిర్వహించి సెంట్రింగ్ డబ్బాలను రాత్రికి రాత్రే మాయం చేస్తారు. ఈ నెల 23న సాయంత్రం మన్నెగూడ చౌరస్తా వద్ద ఒకే బైక్‌పై ముగ్గురు వెళ్తుండగా అనుమానం రావడంతో పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా ఈ నెల 8న కుర్మల్‌గూడలో, ఫిబ్రవరి 20వ తేదీన మన్నెగూడలో మార్చి 15న రావిర్యాలలో సెంట్రింగ్ డబ్బాలు ఎత్తికెళ్లినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.1,85,000 నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిలో మహ్మద్ నసీర్ అలీపై గతంలో 19 పాత కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్‌లు పేర్కొన్నారు. కేసును ఛేదించడానికి సహకరించిన క్రైం బృందాన్ని సీఐ అభినందించారు.


పోలీసుల అదుపులో నిందితులు

డీసీఎం, ఆటో ఎదురెదురుగా ఢీ

ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి

మహేశ్వరం: డీసీఎం, ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మండలంలోని తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారిపైన మ్యాక్ ప్రాజెక్టు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్ట సాయినగర్‌కి చెందిన మహ్మద్ తాహీర్(50), ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కందుకూరు నుంచి హైదరాబాద్ వైపు తన ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా, మహేశ్వరం గేటు నుంచి కందుకూరు వైపు వస్తున్న డీసీఎం వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహ్మద్ తాహీర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను మహ్మద్ షఫీగా గుర్తించి, కేసు నమోదు చేసుకొని తాహెర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో


మహ్మద్ తాహీర్ మృతదేహం

కుమారుడిని చూసేందుకు వెళ్తూ..

తండ్రి మృతి

కొందుర్గు: అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కుమారుడిని చూసేందుకు వెళ్తూ ఓ తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన కొందుర్గు మండలం చెక్కలోనిగూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెక్కలోనిగూడకు చెందిన బొప్పల లక్ష్మమ్మ, రామచంద్రయ్య దంపతుల కుమారుడు మహేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లక్ష్మమ్మ చికిత్స పొందుతున్న కుమారుడి వద్దనే ఉంది. కాగా, తండ్రి రామచంద్రయ్య(54) తన కుమారుడిని చూసివద్దామని ఆదివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. చెక్కలోనిగూడ నుంచి కొందుర్గు వైపు వెళ్తుండగా లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో రామచంద్రయ్య ద్విచక్ర వాహనం వెనుక నుంచి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.


రామచంద్రయ్య మృతదేహం

వైభవంగా రథోత్సవం


రథోత్సవ వేడుకలు

తుక్కుగూడ : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (ఈసిటీ)ఆదిలక్ష్మి అలివేలుమంగా సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మూడవ రోజు వైభవంగా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆలయ మాఢవీధుల్లో వేంకటేశ్వర అలివేలు దంపతులను ఊరేగించారు. రథోత్సవ వేడుకలు తిలకించడానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తూళ్ల వీరేందర్‌గౌడ్ కుటుంబసభ్యులు, ఆలయ వంశపార్య ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహచార్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తినుబండారాల దుకాణం పెట్టుకున్న వెల్దండ మండలం బండోనిపల్లికి చెందిన అర్జున్ కుమారుడు జయదేవ్(3)పై వేడినూనె పడటంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దండ మండలం బండోనిపల్లికి చెందిన అర్జున్, అతని కుటుంబ సభ్యులు ఆమనగల్లులోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తినుబండారాల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రాత్రి ప్రమాదవశాత్తు జయదేవ్‌పై వేడినూనె పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు. బాలుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: అప్పులబాధతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామశివారులో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వెజర్ల గ్రామానికి చెందిన రామకృష్ణ(35), అరుణ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రామకృష్ణ ఈ నెల 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీకోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేదు. గ్రామ సమీపంలో కొందరు యువకులు క్రికెట్ ఆడుతుండగా ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లుగా గుర్తించి గ్రామస్తులు తెలియచేశారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి రామకృష్ణగా గుర్తించారు. అప్పుల బాధతో రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ పేర్కొన్నారు.

తల్లీపిల్లల అదృశ్యం

పహాడీషరీఫ్: ముగ్గురు పిల్లలు, తల్లి అదృశ్యం అయిన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రుక్మిణీ దేవి(32), రంజన్ కుమార్ దంపతులు ఏడాది క్రితం జల్‌పల్లి శ్రీరాంకాలనీకి వలస వచ్చారు. రుక్మిణీదేవి స్థానికంగా ఉన్న ప్లాస్టిక్ కంపెనీలో పని చేస్తుంది. ఈ నెల 14న రాత్రి భార్యాభర్తలు గొడవ పడ్డారు. రంజన్ బయటకు వెళ్లొచ్చేసరికి రుక్మిణీ దేవి, కుమార్తెలు రుచి కుమారి(13), మేఘాకుమారి(10), కుమారుడు అన్షుకుమార్(8) కనిపించలేదు. వీరి ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదు. బీహార్‌కు చెందిన కృష్ణచౌదరి అనే యువకుడు తీసుకొని వెళ్లి ఉంటాడని రంజన్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు!

అత్తాపూర్: అత్తాపూర్, అత్తాపూర్ ఓల్డ్ విలేజ్ తదితర ప్రాంతాల్లోని ఇరుకైన రోడ్డు మార్గాల్లో కొందరు బహుళ అంతస్తులు నిర్మిస్తూ పరిసరాలను ఆక్రమిస్తున్నారు. దీంతో గ్రామస్తులు రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులకు వినతి పత్రాలు అందజేయడంతో వారు పనులు ఆపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కేవలం 100–150 గజాల్లోనే ఐదారు అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ 15 ఫీట్ల ఉన్న రోడ్డు వరకు ఆక్రమిస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి సమస్యలు వచ్చి పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భువనగిరి రేసులో ‘ఈసీ’

ఇబ్రహీంపట్నం: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఈసీ చంద్రశేఖర్‌గౌడ్(మామ) తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు 15 సంవత్సరాలకుపైగా ఆదిబట్లకు సర్పంచ్‌గా పని చేయడమేగాక, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పని చేసిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతగా శేఖర్‌గౌడ్‌కు పేరుంది. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి ఓటమి చెందారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరిన ఆయన ఇబ్రహీంపట్నం అసెంబ్లీ టికెట్‌ను ఆశించి భంగపడ్డారు. సుమారు 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఆయన కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన తనకు సీటు కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరుతున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి తన అభ్యర్థిత్వానికి మద్దతు నివ్వాలని కోరుతూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో దశలో టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి భువనగిరి ఎంపీ స్థానాన్ని కేటాయించాలని విన్నవించారు. బీసీ సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇప్పటికే అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ప్రకటించిన సంగతిని ఆయనకు వివరించారు. తనకు అవకాశం కల్పిస్తే గెలిచి తీరుతానని పార్టీ అధిష్టానం వద్ద తన వాయిస్‌ను వినిపిస్తున్నారు. ఈసీ శేఖర్‌గౌడ్ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపుతుందా లేక మరో అభ్యర్థిని బరిలోకి దించుతుందా అనేది వేచి చూడాల్సిందే.


రేవంత్‌రెడ్డిని కలిసిన ఈసీ శేఖర్‌గౌడ్

ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సన్మానం

ఆమనగల్లు: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ఆమనగల్లుకు చెందిన పలువురు నాయకులు సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటించి తిరుగుప్రయాణంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్‌లు ఆమనగల్లు పట్టణంలోని టీ హౌస్ వద్ద కొద్దిసేపు ఆగారు. విషయం తెలుసుకున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఎంపీగా విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంజనేయులు భాస్కర్, అల్లాజీ ఉన్నారు.


ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నేతలు

బతుకు పోరు.. ఆట బొమ్మల నీడే తోడు!

కడుపు నిండా అన్నం తినేందుకు పేదలు ఎన్నో అవస్థలు పడుతుంటారు. కష్టాలు ఎదుర్కొంటూ జీవనం కొనసాగిస్తుంటారు. ఎండ వేడిమి తట్టుకోలేక ఆట బొమ్మల నీడనే ఆధారంగా చేసుకొని ఓ వైపు బొమ్మలను విక్రయిస్తూ మరో వైపు కొడుకును ఆనీడలోనే ఆడిస్తుంది ఓ తల్లి.. ఈ దృశ్యం షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం కనిపించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజస్థాన్‌కు చెందిన ఓ కుటుంబం ఇటీవల షాద్‌నగర్‌కు వచ్చింది. పిల్లలు ఆడుకునే బొమ్మలను రోడ్డుపై విక్రయిస్తున్నారు. ఓ తల్లి తన కొడుకుతో ఎర్రటి ఎండలో రోడ్డుపై కర్రకు బొమ్మలను కట్టి వాటిని అమ్ముతున్నారు. అయితే, మధ్యాహ్న సమయంలో చుట్టూ పక్కల నీడ లేకపోవడంతో తల్లీ కొడుకులు బొమ్మల నీడనే ఆధారంగా చేసుకొని రోడ్డుపై కూర్చొని విక్రయిస్తున్నారు.

– షాద్‌నగర్

